# సరిలేరు మాకెవ్వరు..

- ప్రచారానికి మరింత పదును పెంచేలా కార్యాచరణ
- ఈ నెల 16న గ్రేటర్ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం
- మరుసటి రోజు నుంచే అభ్యర్థుల పాదయాత్రలు
- భారీ మెజార్టీయే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలు

టాప్ గేర్‌లో కారు



మూసారంబాగ్ అఫ్జల్‌నగర్‌లో సిద్ధమవుతున్న బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ): ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ దూకుడు పెంచింది. రెండు నెలల ముందే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించగా..షెడ్యూల్ కంటే ముందే వారంతా నియోజకవర్గాన్ని చుట్టేసి తొలి విడత ప్రచారాన్ని పూర్తి చేశారు. విపక్షాలు ఇంకా అభ్యర్థుల వెతుకులాటలోనే ఉండగా..అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫాంలు ఇచ్చేందుకు ముహూర్తం కూడా ఖరారు చేసింది. ఈ నెల 15న సీఎం కేసీఆర్ అభ్యర్థులకు పార్టీ బీ ఫాంలను అందజేస్తారు. ఆదివారం నుంచి పార్టీ పరంగా, ఇటు అభ్యర్థులంతా ప్రజల్లోనే ఉండేలా ప్రచారానికి పదును పెంచే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 16న గ్రేటర్ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరగనున్నది. ఇందులో నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్యనేతలతో 45 రోజుల ప్రణాళికలకు సంబంధించి బాధ్యతలు అప్పగిస్తారు. అంతేకాకుండా అభ్యర్థులు భారీ ఎత్తున పాదయాత్రలకు శ్రీకారం చుడతారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనను కరపత్రాలతో ప్రజల కండ్ల ముందు ఉంచి ఓటర్లకు చేరువ కానున్నారు. దీంతో పాటు పార్టీ మ్యానిఫెస్టోతో పాటు నియోజకవర్గంలో ప్రత్యేక మ్యానిఫెస్టోను రూపొందించుకొని ప్రజల్లోకి వెళ్లనున్నారు. డివిజన్‌కు రెండు పార్టీ కార్యాలయాలు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ర్యాలీలు, బహిరంగ సభలకు సంబంధించిన ముందస్తు అనుమతులు, అభ్యర్థుల ప్రచారం, నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం, రోజువారీ ప్రచార శైలి, ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కొనే ప్లాన్ తదితర అంశాలను రోజూవారీ నివేదిక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అందజేయడం లాంటి వాటితో భారీ మెజార్టీతో గెలిచేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.

### కొనసాగుతున్న చేరికలు.. అభ్యర్థుల మద్దతు

గుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కొందరు.. ప్రతిపక్ష పార్టీల్లో అభ్యర్థుల నాన్చివేత ధోరణితో విసిగిపోయి మరికొందరు..బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. జూబ్లీహిల్స్, సనత్‌నగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయా నియోజకవర్గాల్లో పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థులకు అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని, పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. కాలనీలు, బస్తీల్లో అభ్యర్థులకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు సైతం చేస్తున్నారు.



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## ఎన్నికలు ఏవైనా.. బీఆర్ఎస్‌దే విజయం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 12: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్ఎస్ పార్టీదేనని బీఆర్ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్ వంగ శంకరమ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన గిరిజనుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గిరిజనుల కోసం సీఎం కేసీఆర్ రూ. 10 కోట్లతో బంజారా భవన్ నిర్మించారన్నారు. తండాలను గ్రామపంచాయతీలను చేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయమని అన్ని సర్వేలు సూచిస్తున్నాయని, బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఉనికి లేదని, కాంగ్రెస్‌కు క్యాడర్ లేదని అన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదని పేర్కొన్నారు. దేశం మొత్తంలో రెండు సార్లు రైతులకు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. పేద వర్గాలకు రూ. 200 ఉన్న పింఛన్లను రూ. 2వేలకు పెంచడంతో పాటు 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్‌దేనని, ఆరు ఏండ్ల కాలంలో రూ. 65 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించి ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయం అందించాలని, కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని గిరిజనులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అండగా ఉంటా.. ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, అక్టోబర్ 12 : ఉప్పల్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో డివిజన్ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌తో కలిసి డివిజన్ నాయకులు, కార్యకర్తలతో పార్టీ విస్తృత స్థాయి సమావేశం, ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు రెండు నెలల పాటు పనిచేసి గెలిపిస్తే ఐదేండ్లు సేవ చేసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. అంతకుముందు చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో భగవాన్ కాలనీ, శ్రీకృష్ణానగర్, రెడ్డి కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.




ఏఎస్‌రావునగర్ డివిజన్ మహిళా నేతలతో బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి తదితరులు



మంత్రి తలసానికి మద్దతు తెలుపుతున్న సిక్కులు

# తలసానికే మా మద్దతు

- ఏకగ్రీవ తీర్మానాలు చేసిన సిఖ్ కమిటీ, వయోధికుల సంఘాలు
- ఇదే బాటలో మరిన్ని కాలనీలు, యువజన, మహిళా, బస్తీ సంఘాలు

అమీర్‌పేట్, అక్టోబర్ 12 : మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కే తాము ఓటు వేస్తామంటూ నియోజకవర్గం పరిధిలోని వివిధ సంఘాల ప్రతినిధులు తీర్మానాలు చేస్తున్నారు. బుధవారం రాత్రి అమీర్‌పేట్ సిఖ్ ప్రతినిధులు, ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి ప్రతినిధులు తమ తమ ప్రాంగణాల్లో జరిగిన ప్రతినిధుల సమావేశాల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఇదే బాటలో నియోజకవర్గం పరిధిలోని మరిన్ని కాలనీలు, యువజన, మహిళా, బస్తీ సంఘాలు ఏకగ్రీవ తీర్మానాలు చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తున్నది. బుధవారం అమీర్‌పేట్ గురుద్వారా సమీపంలోని మన్‌మీత్ చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ట్రస్టు అధ్యక్షుడు సరాందర్ కుల్వంత్‌సింగ్ (టిల్లు భాయ్) ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి తలసానికి మద్దతు తెలుపుతూ చేసిన తీర్మానంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సిఖ్ కమిటీ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ఉదయం సిఖ్ కమిటీ ప్రతినిధులంతా మంత్రి తలసానిని ఆయన నివాసంలో కలిసి తమ తీర్మాన ప్రతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, మండలి సలహాదారు కాసాని సహదేవ్‌గౌడ్, ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, పెరుమాండ్ల లింగమయ్య సహ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొనారు.



## గుండెల నిండా అభిమానం.. పథకాలపై ప్రచారం

నగరానికి చెందిన రామప్రతాప్ రాయ్ శ్రీవాస్తవ్ సీఎం కేసీఆర్ వీరాభిమాని. ఆయనపై ఉన్న గౌరవంతో 2015 నుంచి ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలపై కారు ద్వారా ఇలా వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు.

– చిక్కడపల్లి, అక్టోబర్ 12



నేరేడ్‌మెట్ డివిజన్‌లో పాదయాత్ర చేసి స్థానికులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మల్కాజిగిరి ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి

## సంక్షేమ సర్కారు..

మల్కాజిగిరి, అక్టోబర్ 12 : మైనార్టీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని బీఆర్ఎస్ మల్కాజిగిరి ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం అల్వాల్ డివిజన్ రాజీవ్ వీకర్‌సెక్షన్ కాలనీ, వెంకటాపురం డివిజన్ ఇందిరానగర్ బస్తీ, వినాయక్‌నగర్ బస్తీ, నేరేడ్‌మెట్ డివిజన్లలో పాదయాత్ర నిర్వహించారు. బాలసరస్వతినగర్‌లో మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. యువతీ యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రభుత్వం ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెలనెల పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో ఆడ బిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి- షాదీముబారక్ పథకం ద్వారా రూ.1,00,116 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. దళిత బంధు ద్వారా నియోజకవర్గానికి 100 మందికి ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సబితాకిశోర్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మీనాఉపేందర్‌రెడ్డి, అనిల్ కిశోర్, ఉపేందర్‌రెడ్డి, నేమూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకటనలకు అనుమతి తప్పనిసరి..

-పెయిడ్ న్యూస్‌ల పర్యవేక్షణకు ఎంసీఎంసీ ఏర్పాటు.. మీడియా అతిక్రమణలపై కమిటీ పరిశీలన



సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ): ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ప్రకటనలపై ముందస్తుగా జిల్లా ఎన్నికల అధికారి అనుమతి పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, ఆడియో, వీడియో డిస్‌ప్లే, సినిమా థియేటర్లు, రేడియో చానల్, బల్క్ ఎస్ఎంఎస్, వెబ్‌సైట్‌లలో ప్రసారం చేసే వీడియో ప్రకటనలతో పాటు వాల్ రైటింగ్ డిస్‌ప్లే, వాహనాలకు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. వార్త పత్రికలు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో వచ్చే పెయిడ్ న్యూస్ గుర్తింపునకు ప్రత్యేకంగా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీ, ఎంసీ)ని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్వో సెక్షన్‌లో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. జిల్లా ఎన్నికల అధికారి చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్, సీనియర్ జర్నలిస్టు, జీహెచ్‌ఎంసీ సీపీఆర్వోలు, హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమించినట్లు రోనాల్డ్ రాస్ తెలిపారు.

### మీడియా అతిక్రమణలకు కట్టడి..

ఎన్నికల సందర్భంగా మీడియా అతిక్రమణలు జరిగితే ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని రోనాల్డ్ రాస్ తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా, శాటిలైట్ చానల్స్, లోకల్ కేబుల్ నెట్‌వర్క్స్‌లో ప్రసారమయ్యే అన్ని రకాల రాజకీయ ప్రకటనలను ఎంసీ, ఎంసీ కమిటీ ద్వారా ముందస్తుగా అనుమతి పొందాలని, అదే విధంగా పోలింగ్ రోజు, ముందు రోజు ప్రచురితం అయ్యే ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనలను కూడా అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రాజకీయ ప్రకటనలకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు కూడా అనుమతి తీసుకోవాలని చెప్పారు. పోస్టర్లు, కరపత్రాలు కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిధిలోనే ఉండాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులకు మాత్రమే హైదరాబాద్ జిల్లా ఎంసీ ఎంసీ కమిటీ ద్వారా రాజకీయ ప్రకటనలకు అనుమతి జారీ చేస్తామని స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, రిజిస్ట్రార్ అయిన రాజకీయ పార్టీలు రాజకీయ ప్రకటనలకు సంబంధించి రాష్ట్ర స్థాయి ఎంసీ ఎంసీ కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని రోనాల్డ్ రాస్ స్పష్టం చేశారు.

### పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక నిఘా..

ఏదైనా పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా చానల్స్‌లో వచ్చే వార్తలు, సోషల్ మీడియా విశ్లేషణలకు డబ్బులు చెల్లించడం లేదా ప్రలోభాలు.. తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని పెయిడ్ న్యూస్‌గా ఎంసీఎంసీ కమిటీ గుర్తిస్తుంది. క్షేత్ర స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న పెయిడ్ న్యూస్‌లను అరికట్టడానికి ప్రత్యేకంగా పెయిడ్ న్యూస్ నియంత్రణ వ్యవస్థను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ మీడియా మానిటరింగ్, సర్టిఫికేషన్ కమిటీ ఈ పెయిడ్ న్యూస్‌లను గుర్తించి రిటర్నింగ్ అధికారుల ద్వారా సంబంధిత అభ్యర్థికి నోటీసులు జారీ చేస్తుంది. పెయిడ్ న్యూస్‌కు సంబంధించి సమాచార శాఖ అందించిన రేట్ కార్డును అనుసరించి వాటికి అయ్యే వ్యయాన్ని లెక్కించి అభ్యర్థుల ఎన్నికల వ్యయంలో జమ చేయడానికి ఆర్వో ద్వారా నోటీసులు జారీ చేస్తారు. ఈ నోటీసు ప్రతిని ఎన్నికల వ్యయ పరిశీలకులకు అందజేస్తారు. పత్రికలు, టీవీ చానల్స్‌లో ప్రసారమైన పెయిడ్ న్యూస్ వ్యయాన్ని తమ ఎన్నికల వ్యయంలో ఎందుకు కలపరాదో కోరుతూ.. 96 గంటల్లోగా సంబంధిత అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి నోటీసులు జారీ చేస్తారు. పెయిడ్ న్యూస్‌పై రిటర్నింగ్ అధికారి జారీ చేసిన నోటీసులకు సంబంధిత అభ్యర్థులు 48 గంటల్లోగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థుల సమాధానానికి ఎంసీ ఎంసీ కమిటీ సంతృప్తి చెందనట్లయితే ఆ వ్యయాన్ని అభ్యర్థుల ఎన్నికల వ్యయంలోకి కలుపుతారు.

### అన్ని న్యూస్ చానళ్ల ప్రసారాలు రికార్డింగ్

వివిధ చానళ్లలో వచ్చే వార్తలను రికార్డింగ్ చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు సంబంధించి అభ్యర్థులు, పార్టీలు నిర్వహించే ప్రచారాలకు సంబంధించి చానళ్ల రికార్డింగ్‌ను చేపట్టామని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచి పెయిడ్ న్యూస్, ప్రకటనలకు సంబంధించి వ్యయాన్ని, అభ్యర్థుల ఎన్నికల వ్యయంలో కలుపనున్నట్టు వెల్లడించారు.

## రూ.50 వేల కంటే.. ఎక్కువ తీసుకెళ్లకండి



మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 12: ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా 24 గంటలూ పటిష్టమైన నిఘా ఉంచాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లరాదని, ఒక వేళ తీసుకెళ్లినా.. సరైన ధ్రువపత్రాలు వెంట ఉండాలని, లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు తప్పకుండా పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని, జిల్లా వ్యాప్తంగా నగదు, మద్యం తరలించడం వంటి చర్యలకు పాల్పడకుండా పటిష్టమైన బందోబస్తు, నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ జానకి, రిటర్నింగ్, నోడల్, ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.